క్లుప్తంగా

వేడుకగా ప్రత్యంగిరా హోమం



ప్రత్యంగిరా హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జగద్గిరిగుట్ట: అమావాస్యను పురస్కరించుకొని డివిజన్ పరిధిలోని వివిధ ఆలయాలలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజయ్యనగర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో అభిషేకం, అర్చన, అలంకరణ వంటి పూజలతో పాటు ప్రత్యంగిరా హోమాన్ని వేడుకగా నిర్వహించారు. జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీ కాళికామాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సుభాష్‌నగర్: దూలపల్లిలోని తుమ్మచెరువు బఫర్ జోన్ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలను బుధవారం మేడ్చల్ రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గతంలో చెరువు బఫర్ జోన్‌లో మట్టి నింపుతుండగా దూలపల్లి గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మేడ్చల్, దుండిగల్ మండలాల తహసీల్దార్లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తక్షణమే ఆ మట్టిని తీయాలని సదరు వ్యక్తికి నోటీసులు జారీ చేశారు. అప్పటి నుంచి మట్టి తీయడమేమోగానీ ఏకంగా షెడ్లు వేశారు. తాజాగా అధికారులు వాటిని తొలగించారు.

విద్యార్థినులకు చేయూత

దుండిగల్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు పలువురు ముందుకు వచ్చారు. దుండిగల్ ప్రభుత్వ ఉన్న పాఠశాలలో గత ఏడాది 10వ తరగతి ఫలితాల్లో 9.7 జీపీఏ సాధించిన ముగ్గురు విద్యార్థినులు కె.నిఖిత, మీనాక్షి, షమ్మ కాతూన్‌లకు ఒక్కొక్కరికి రూ. 5 వేల ప్రకారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్య నళిని అందజేశారు. అలాగే బాసర ఐఐటీ సీటు సాధించిన నిఖితకు స్థానిక కౌన్సిలర్ జక్కుల కృష్ణాయాదవ్ బంగారు ఉంగరాన్ని బహూకరించారు. రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు రాధాకృష్ణ సాయి, చక్రవర్తిలు బాలికలకు శానిటేషన్ ప్యాడ్స్, వెండింగ్ మిషన్, బహుమతులు ఇచ్చారు. హిందీ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి రూ. 3 వేలు, పూర్వ విద్యార్థులు కాపర్ బాటిళ్లను అందజేశారు.

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

కుత్బుల్లాపూర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారంతోపాటు అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు ప్రజాప్రతినిధులు బుధవారం పెద్ద ఎత్తున ఎమ్మెల్సీ రాజును కలిసి పలు సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. దళిత సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకొని తమ సమస్యలను చెప్పుకొన్నారు. నిజాంపేట కార్పొరేటర్లు ఎమ్మెల్సీని కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం రేషన్ డీలర్ల కమీషన్ పెంచిన



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న అమర ఇంద్రసేనగుప్తా తదితరులు

నేపథ్యంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అమర ఇంద్రసేన గుప్తా ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాన కార్యదర్శి మధుసూదన్ యాదవ్ సలహాదారులు నాగిళ్ల శ్రీనివాస్, అశోక్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సురేష్ తదితరులు ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఉన్నారు.

- డబల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే విచారణకు అధికారులు రాలేదని తమకు ఎలాగైనా డబల్ బెడ్ రూమ్ వచ్చేలా చూడాలని పలువురు దరఖాస్తులతో ఎమ్మెల్సీ రాజును కలిసి విన్నవించగా పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించి ఎంపిక చేస్తారని ఇందులో రాజకీయాలు ఉండవని స్పష్టం చేశారు.
- ఆర్థికంగా ఇబ్బందులతో ఉన్న మా కుటుంబాన్ని ఆదుకోవాలని ఓ మహిళ ముగ్గురు పిల్లలతో కలిసి ఎమ్మెల్సీ రాజును కలిసి తన గూడును వెల్లపుచ్చుకోగా తప్పకుండా ప్రభుత్వం తరఫున వచ్చే సంక్షేమ ఫలాలు అందించే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

వాజ్‌పేయికి నివాళి

కుత్బుల్లాపూర్: పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించి భారతదేశ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయికే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో వాజ్‌పేయ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ వాజ్‌పేయి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేత, కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ నేత,



వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కంది శ్రీరాములు, దుర్యోధన రావు, సీనియర్ నాయకులు పత్తి రఘుపతి, రాజేష్ మిశ్రా, అరకల సుధా, అలివేలు, నర్సింగరావు, ఝాన్సీ, గంగారాం, మురళి, రామ్‌సింగ్, గోపాల్, విగ్నేష్, శ్రీనివాస్ రెడ్డి, అభిషేక్, పవన్, జహంగీర్, నవీన్, శివానంద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రకటనలు సిగ్గుచేటు

బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

జీడిమెట్ల: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను తామే ఇచ్చినట్లు బీఆర్ఎస్ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి ఆరోపించారు. బుధవారం షాపూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖాతాలో వేస్తూ ఎమ్మెల్యే వివేకానంద తప్పుడు ప్రచారానికి తెరలేపారని ఆరోపించారు. ప్రజలకు ఉన్నది ఉన్నట్లుగా చెప్పాల్సిన బాధ్యత నాయకులదేనని అన్నారు. బోయిన్‌పల్లి నుంచి వేస్తున్న ఫ్లైఓవర్, రోడ్డు విస్తరణ పనులు కేంద్ర ప్రభుత్వం ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం నిధులంటూ ఎమ్మెల్యే అబద్ధం చెప్పడం ఎంత వరకు సమంజసమా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకువచ్చిన ప్లైఓవర్ ఒక్కటి కూడా కుత్బుల్లాపూర్‌లో లేదన్నారు. విలేకరుల సమావేశంలో బక్కాశంకర్‌రెడ్డి, ఎం.ఎస్ వాసు, గరిగె శ్రీనివాస్, లక్ష్మిపతి రాజు, పులి బలరాం, పత్తి సతీష్, సాయినాథ్ నేత, భీమరాజు, సతీష్‌లు పాల్గొన్నారు.

నాట్యాచార్యకు సన్మానం

కుత్బుల్లాపూర్: నాట్యాచార్య ఘంటసాల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కోటి తిలక్‌నగర్‌లోని కళాక్షేత్ర డ్యాన్స్ అకాడమీలో కుచిపూడి డ్యాన్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన ఫొటోగ్రాఫర్ ఇమ్మడి వేణును నిజాం



పేట్ జిల్లా మాపల్లె టెంపుల్ చైర్మన్ నరసింహారెడ్డి చేతుల మీదుగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

రెగ్యులరైజ్ చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి

కుత్బుల్లాపూర్: తమను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, కమిషనర్ శ్రీహరిలను కలిసి వినతి పత్రం అందజేశారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, జీతాలను పెంచడంతో పాటు తమను రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగులు కోరగా చైర్మన్ సానుకూలంగా స్పందించారు.

అనారోగ్య సమస్యలు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

సుభాష్‌నగర్: అనారోగ్య సమస్యలను భరించలేని ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూరారం పోలీసుల సమాచారం మేరకు... పశ్చిమ బెంగాల్ నదియా జిల్లా నాదిబతాయ్‌కు చెందిన నితాయ్ మండల్(27) జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చి సూరారం రాజీవ్ గృహకల్పలో నివాసముంటూ ఓ పరిశ్రమలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 15న నితాల్ మండల్ భార్య జూపార్క్‌కు వెళ్లడంతో ఫిట్స్ కారణంగా బాధపడుతన్న అతనొక్కడే ఇంట్లో ఉన్నాడు. సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో నితాయ్ మండల్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫిట్స్ కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి సోదరుడు సుకుమార్ మండల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారం

కూకట్‌పల్లి: డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్, ప్రగతినగర్‌లలో అన్ని విభాగాల అధికారులతో కలిసి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.

'ఉద్యమకారులకు కేసీఆర్ ద్రోహం'



ఉద్యమకారుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న అశోక్‌రెడ్డి తదితరులు

రంగారెడ్డినగర్: సీఎం కేసీఆర్ ఉద్యమకారులను తన అవసరంకొద్దీ వాడుకున్నారే తప్ప ఎన్నడూ వారిని ఆదుకున్న పాపాన పోలేదని ఉద్యమకారుల వేదిక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి ఆరోపించారు. రంగారెడ్డినగర్ డివిజన్‌కు చెందిన ఉద్యమకారులు ఉద్యమకారులు లక్ష్మణ్ గౌడ్, ఫయాజ్, నర్సింగ్, మహబూబ్‌లు తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ చేపట్టిన నిరాహార దీక్ష రెండవ రోజుకు చేరుకుంది.. బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలోని దీక్షా శిబిరానికి వచ్చిన అశోక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పప్పిరెడ్డి సరేందర్‌రెడ్డిలు ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమకారులకు రూ. 10 వేల పింఛన్, ఉచిత బస్‌పాస్ ఇవ్వాలని, సంక్షేమ పథకాల్లో 20 శాతం ఉద్యమకారులకు ఇవ్వడంతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం దీక్ష చేపట్టిన వారికి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఫయాజ్, కృష్ణారెడ్డి, శోభకృష్ణాగౌడ్, రామస్వామి, జానయ్య నిరాహార దీక్షకు సంఘీభావం తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: ఫీడర్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కుత్బుల్లాపూర్ సెక్షన్ ఏఈ రవీందర్‌రెడ్డి వెల్లడించారు. 11 కేవీ పద్మానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పద్మానగర్ రింగ్ రోడ్డు, పద్మానగర్ ఫేజ్-2, శ్రీరామ్‌నగర్, ఎంఎన్ రెడ్డినగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. 11 కేవీ సాయిబాబానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వాజ్‌పేయినగర్, నాగులకుంట, బాపూనగర్, పద్మానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వివరించారు.

ఉషాముళ్లపూడి ఫీడర్ పరిధిలో..

సుభాష్‌నగర్: 11 కేవీ ఉషాముళ్లపూడి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గాజులరామారం ఏఈ భార్గవ్ చైతన్య తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దేవేందర్‌నగర్, పోచమ్మ బస్తీ, జీఎన్ఎస్‌యూఆర్ఎం, లాల్‌సాబ్‌గూడ, బతుకమ్మబండ, కట్టమైసమ్మ బస్తీ, ఆర్‌వీఎస్ ఆర్ నగర్‌లలో విద్యుత్ ఉండదన్నారు.

మిథిలానగర్ ఫీడర్ పరిధిలో..

నిజాంపేట్: 11కేవీ మిథిలానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మిథిలానగర్, ఆర్‌కే లేఅవుట్ పార్క్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ప్రగతినగర్ ఏఈ తెలిపారు. 11కేవీ రాజీవ్‌గృహకల్ప ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాసవీ లేఅవుట్, విజేత సూపర్‌మార్కెట్, గోదావరి కట్స్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తాన్నారు. 11కేవీ బౌరంపేట్ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఫీడర్ లైన్ల బైఫరీకేషన్ పనుల నేపథ్యంలో 11 కేవీ కోకకోలా, బౌరంపేట్ కేబుల్ ఫీడర్, కేవీఆర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వివరించారు.

కేన్సర్ బాధితులకు చేయూత

జీడిమెట్ల: కేన్సర్ బాధితుల కోసం వెంట్రుకలను డొనేట్ చేయడం సంతోషంగా ఉందని కొమరవోలు కాంతారావు, చిద్విలాస్ అన్నారు. మన జుట్టును దానం చేయడం ద్వారా కేన్సర్ బాధితులకు రూ. 5 వేలు సాయం చేసిన వారమవుతామని హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తెలుసుకున్నారు. బుధవారం హైదరాబాద్ హెయిర్ డొనేషన్ ఫర్ కేన్సర్ పేషెంట్స్ ఆర్గనైజేషన్ గారికి హెయిర్‌ను అందజేశారు. తండ్రి, కొడుకులు దానం చేసిన హెయిర్ ద్వారా కేన్సర్ బాధితులకు రూ. 10 వేలు అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవినాయక్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను రూపొందించాలి

దుండిగల్: ఎలాంటి ఇబ్బందులు కలగుండా ఓటరు జాబితా తయారు సత్వరమే రూపొందించాలని దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల కమిషనర్లు సత్యనారాయణ, శ్రీహరి అన్నారు. దుండిగల్ కౌన్సిల్ హాల్‌లో సూపర్‌వైజర్లు, బీఎల్ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఫాం 6 నుంచి 8వ వరకు దరఖాస్తు చేసుకున్న వాటిని క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మేనేజర్లు నర్సింహులు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలతో పరేషాన్

చింతల్: వీధి లైట్లకు మరమ్మతులు చేపట్టపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చింతల్ డివిజన్ భగత్‌నగర్‌లోని రోడ్డు నెంబర్ 4లో నెల రోజులుగా వీధిలైటు వెలగడం లేదు. దీంతో రాత్రివేళల్లో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.